క్లుప్తంగా

రాజగోపురానికి రూ.70 వేలు విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. బెంగళూరు వాస్తవ్యులు ఇల్లూరు విజయకుమార్ వారి కుటుంబ సభ్యులు రూ. 70వేలను అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి, స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, ఉప ప్రధాన అర్చకుడు పూజన్నస్వామి పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలు స్థాపించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: రెండో ముంబాయిగా ప్రసిద్ధి గాంచిన ఆదోనిలో కొత్త పరిశ్రమలను స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు వీరేష్, మాజీ డివిజన్ కార్యదర్శి లక్ష్మన్న కోరారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని తిక్కస్వామి దర్గా ఏరియాలో సంఘం జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నవీన్, వీరేష్, మోహన్, భీమ తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 5వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో చలో కలెక్టరేట్ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచిన ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యా దీవెన పథకం కింద ఉన్న రూ.3,480 కోట్లు, వసతి దీవెన పథకం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, శశిధర్, నాగరాజు, సంతోష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మన్న

కోసిగి: మండల పరిధిలోని నేలకోసిగి గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచి పోయి తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పశువుల హనుమంతమ్మ, ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకులు పశువుల లక్ష్మన్న తాగునీటి బోరుకు మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరించారు.

శ్రీమఠంలో కన్నయ్య నాయుడు



కోసిగి: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం జలశయాల గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు దంపతులు ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం రాఘవేంద్ర మూల బృందావనం చేరుకుని దర్శించుకున్నారు.

మిరపకు 'జెమిని' పోటు

- పంటకు వైరస్ సోకడంతో అల్లాడుతున్న అన్నదాతలు
- ఏం చేసినా అదుపులోకి రాని వైనం
- అప్పులపాలవుతున్న రైతులు
- మందులు లేవంటున్న వ్యవసాయాధికారులు



జెమిని వైరస్ సోకిన మొక్క



నందవరంలో జెమిని వైరస్ సోకిన మిరప పంట

నందవరం : జెమిని వైరస్ ఆ పేరు వినగానే మిరప రైతుల్లో వణుకు పుడుతోంది. ఒక్క సారి సోకిందంటే అధఃపాతాళానికి తొక్కేస్తుంది. వేలాది రూపాయలు గుమ్మరించిన వైరస్ మాత్రం పోయ్యేదే లేదు. ఈ ఏటా ఈ వైరస్ విజృంభన అధికమైంది. ఆదిలోనే మిరప రైతు కంట్లో కారం కొట్టింది. వందలాది ఎకరాలను ముంచెత్తి నట్టేట ముంచుతోంది. పరిష్కారం లేక రైతన్నలు ఆపసోపాలు పడుతున్నారు. అప్పుల మోపు మోయలేక నలిగిపోతున్నాడు.

పంట సాగు వివరాలు

నందవరం మండలంలో పత్తి, వరి పంటల సాగు తర్వాత ప్రధాన పంట మిరప పైర్లు వేశారు. మండలంలో అత్యధికంగా 2,665 హెక్టార్లలో హైబ్రిడ్ రకాల మిరప సాగు చేశారు. మండలంలోని ముగతి, జొహరాపురం, హాలహర్వి, సోమలగూడూరు, కనకవీడు, పొనకలదిన్నె, నందవరం, మాచాపురం, ఇబ్రహీంపురం, కొట్టాల ప్రాంతాల్లో అత్యధికంగా మిరప సాగు చేశారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

మిరప రైతును కొన్నేళ్లుగా జెమిని వైరస్ వెంటాడుతూనే ఉంది. వాతావరణంలో మార్పులు కారణంగా బూడిద, పురుగు, కొమ్మ తెగుళ్ల ధాటికి పైర్లు పచ్చదనాన్ని కోల్పోయాయి. జెమిని వైరస్‌ను నయం చేసుకునేందుకు రూ.వేలల్లో జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఏ పురుగు మందుకు నయం కాకపోవడంతో అప్పులు మిగిల్చుకుంటున్నారు. జెమిని వైరస్ కారణంగా పంట దిగుబడులు పతనస్థాయికి చేరుతాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 35 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 8–10 క్వింటాళ్ల దిగుబడి కూడా వస్తుందో లేదో అని దిగులు చెందుతున్నాడు.

మొక్కలను తొలగించాలి



జెమిని వైరస్ సోకిన మిరప పంటకు సరైన సస్యరక్షణ పద్ధతులు లేవు. పిచికారీ చేసినా పంటను కాపాడుకోవడం కష్టతరం. వైరస్ సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు పైరు నుంచి పూర్తిగా తొలగించాలి. పంటంతా సోకితే పైరును తొలగించుకోవడమే మంచిది. పైరులో ముందుగా పసుపు, నీలి రంగు జిగురు అట్టలను పాతుకోవాలి. ఇలా చేయడంతో నల్లి, దోమ బెడద దాదాపు అదుపులోకి వస్తుంది.
– శ్రీవాణి, ఉద్యానశాఖ అధికారిణి

వైరస్ పీడిస్తోంది



నాకున్న ఎకన్నర పొలంలో మిరప పంట వేశా. పంట మొదట్లో ఆశాజనకంగా ఉండటంతో రక్షణ కోసం రూ.60 వేలు వరకు ఖర్చు పెట్టుకున్నా. పంట చేతికొచ్చే దశలో జెమిని వైరస్ ఆశించి పంటంతా నాశనమైంది. దీనికి తోడు బోరులో నీళ్లు లేక పంట కళావిహీనంగా మారింది. సగం పైగా పంటను తీసేశా. ప్రస్తుతం 6 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.
– కత్రి బసప్ప, నందవరం

ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు



నాకున్న రెండు ఎకరాల్లో మిరప పంట వేశా. పంట సస్య రక్షణ కోసం రూ.1.20 లక్షలు వెచ్చించాను. పంటకు తెగుళ్ల ఆశించడంతో దిగుబడి రెండు ఎకరాల్లో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. అరకొరగా దిగుబడి వచ్చినా ధరలు లభించక నష్టపోతామని దిగులుగా ఉంది. మిరప సాగుచేసి ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాం. పంటలు లేని పరిస్థితుల్లో ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం శోచనీయం.
– వీరేష్, జొహరాపురం

అప్పు చేసి సాగు



నాకున్న రెండు ఎకరాల పొలంలో మిరప వేశాను. సాగు కోసం బయట రూ.లక్ష అప్పు తెచ్చుకున్నాను. మిరపకు జెమిని వైరస్ సోకి పంట చేతికి అందే పరిస్థితి లేదు. తీవ్రంగా నష్టపోతున్నాం. గత పంట దిగుబడిని ఏసీ గొడన్‌లో ఉంచాం. ప్రస్తుతం ధరలు లేక మిరపను అమ్మలేదు. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.
– ఎల్లారెడ్డి , జొహరాపురం

10న ఓపెన్ చెస్ టోర్నమెంట్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ పాఠశాలలో ఈనెల 10న స్పార్క్ చెస్ అకాడమీ వారు ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలిపారు. సాయి జ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగే పోటీల కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 5 సంవత్సరాలు పై బడిన వారు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9885103381 నంబర్‌కుకు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్పార్క్ చెస్ అకాడమి కోచ్ జంబులయ్య, ఐ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లు శ్రీధర్, నాగరాజు మహాదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

పార్థ డెంటల్ జనరల్ మేనేజర్‌పై ఫిర్యాదు

ఆదోని అర్బన్: పార్థ డెంటల్ సంస్థలో దాదాపు రూ.కోటిపైనే అవినీతి చేశారని ఆ సంస్థ జనరల్ మేనేజర్ నరేంద్రపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ సంస్థ మరో జనరల్ మేనేజర్ రమేష్ స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావును సంప్రదించగా.. జనరల్ మేనేజర్ నరేంద్ర అవినీతి చేశారని, ఆ సంస్థ మరో జనరల్ మేనేజర్ రమేష్ ఫిర్యాదు చేసినట్లు ధ్రువీకరించారు. ఎక్కడెక్కడ ఎంత అవినీతి జరిగింది, ఎలా జరిగిందనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉందని, విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నటరాజుస్వామి తదితరులు

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ఆదివారం నటరాజు స్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అలసందగుత్తి గ్రామంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉండడం, గ్రామంలోని బోర్లలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్నందువల్ల గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామప్రజలు ఫ్లోరైడ్ బారిన పడకుండా ఉండడానికి ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆడిటర్ అలసందగుత్తి వీరారెడ్డి, ఆయన కుమారుడు ఆడిటర్ సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.4 లక్షల ఖర్చుతో ఆడిటర్ సాయినాథ్‌రెడ్డి కుమారులు ఆడిటర్ సోమశేఖర్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకోటిరెడ్డి, మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి, అక్షరశ్రీ జూనియర్ కాలేజ్ అధినేతలు సుధాకర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, శ్రీవిద్యా స్కూల్ అధినేత వినోద్‌రెడ్డి, భారత్ గ్యాస్ అధినేత మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసవానికి వెళ్తే చంపేశారు?

- వైద్యుల నిర్లక్ష్యమే బాలింత మృతికి కారణమంటూ బంధువుల ఆరోపణ
- జాతీయ రహదారిపై ఆందోళన



బోయ సుజాత (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి సిజేరియన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చి, తీవ్ర రక్తస్రావమై మృతి చెందడంతో ఆగ్రహించిన బంధువులు..ప్రసవానికని వస్తే నిర్లక్ష్యం చేసి చంపేశారంటూ ఆందోళనకు దిగారు. ఘటనకు సంబంధించి వివరాలు.. మంత్రాలయం మండలం కల్లుదేవకుంటకు చెందిన బోయ మల్లేష్, గోనెగండ్లకు చెందిన సుజాత (28)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి మమత, వినయ్, పురిటి బిడ్డ సంతానం ఉన్నారు. సుజాత మూడోసారి గర్భం దాల్చిన నాటి నుంచి పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉండే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేది. రెండు రోజుల క్రితం పురిటి నొప్పులతో అదే ఆస్పత్రిలో చేరారు. వైద్యులు సిజేరియన్ చేసి ఆడబిడ్డకు పురుడుపోశారు. సుజాతకు అధిక రక్తస్రావమై అపస్మారకస్థితికి చేరింది. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు హుటాహుటిన శనివారం రాత్రి 8 గంటల సమయంలో అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి బాలింత మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆగ్రహించిన బంధువులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎమ్మిగనూరుకు తీసుకొచ్చి ఆదివారం ఉదయం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందిందని, తల్లి మృతితో ఇద్దరు పిల్లలతో పాటు పురిటి బిడ్డ అనాథగా మారిందని వాపోయారు. పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు వారికి సర్దిచెప్పారు. అనంతరం బాలింత మృతదేహాన్ని కల్లుదేవకుంటకు తరలించారు. ఘటనపై పట్టణ సీఐను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామన్నారు.



ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగిన బంధువులు, నిలిచిపోయిన వాహనాలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



యూటీఎఫ్ సీనియర్ నాయకులను సన్మానించిన సభ్యులు

ఆదోని సెంట్రల్: ఉద్యగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగ, జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం పురపాలక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా కౌతాళం మండలం నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావం నుంచి విద్య, ఉద్యగ, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆరు నెలలకు ఒక సారి చెల్లించాల్సిన డీఏలు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, వాణికుమారి, విరుపాక్షి, మహేష్‌లను సన్మానించారు. అదేవిధంగా కౌతాళం మండలం కమిటీ నూతన గౌరవ అధ్యక్షుడిగా బసప్ప, అధ్యక్షుడిగా నల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓంకార్, ఆర్థిక కార్యదర్శిగా బసవరాజు, సహ అధ్యక్షులుగా రంగన్న, విజయలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాసులు, సుధాకర్, రంగన్న, సంధ్య, జ్యోతి, వీరశ్రీ, రాజీవ్ గాంధీలను ఎన్నుకున్నారు.

యురేనియం తవ్వకాల అనుమతులు ఉపసంహరించుకోవాలి



యురేనియం తవ్వకాల ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ: యురేనియం తవ్వకాలకు కేంద్రం ఇచ్చిన అనుమతులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాల ప్రతిపాదిత ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం అనుమతులు, తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులతో సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తవ్వకాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుదామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈనెల 6న కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటిస్తారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు, రైతుసంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, సురేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెవాసుల వలస బాట



వలస వెళ్తున్న చిరుతపల్లి కూలీలు

కోసిగి: బతుకుదెరువు కోసం కూలీలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో గత 20 రోజుల నుంచి రోజు వారీగా లారీలు, టెంపో, ట్రాక్టర్‌లలో వెళ్తూనే ఉన్నారు. ఆదివారం కోసిగిలోని కడపాలెం ఆంజనేయ స్వామి ఆలయ సమీప కాలనీ, మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి టెంపోలలో తరలి వెళ్లారు. అలాగే కౌతాళం మండలం చిరుతపల్లి, తిప్పలదొడ్డి, కరణి ప్రాంతాల నుంచి కోసిగి మీదుగా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లారు. ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా పయనమయ్యారు. వెళ్లిన చోట పత్తి ఏరు పనులు చేయనున్నట్లు కూలీలు తెలిపారు. అక్కడ పిల్లలతో పాటు పెద్దలు కష్టపడి పత్తి తీసే పనులు చేసుకుంటున్నట్లు తెలిపారు. కేజీ పత్తి ఏరితే రూ.12 చొప్పున ఇస్తారని, కుటుంబ అంతట కష్ట పడి రోజుకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల పత్తి ఏరి డబ్బులు సంపాదించుకుంటామని చెబుతున్నారు రోజు వారీగా వందలాది మంది గ్రామాలు వదిలి వెళ్లి వెళ్తుంటే పాలకులు, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నేటికీ గ్రామాల్లో పనులు ప్రారంభించక పోవడం దారుణమని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వరి కోతలు



మిషన్‌తో వరి కోత కోస్తున్న దృశ్యం



పంట నూర్పిడి చేస్తున్న యంత్రం

కోసిగి: తుంగభద్ర నది తీర గ్రామాల్లో సాగుచేసుకున్న వరి పంట చేతికి రావడంతో రైతన్నలు కోతలకు సంసిద్ధమయ్యారు. కోసిగి మండలంలోని కడదొడ్డి, కందుకూరు, లక్ష్మీనగర్ క్యాంప్, అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు గ్రామాల్లోని నది తీర ప్రాంతాల్లో దాదాపు 2200 ఎకరాలు వరి పంటలు సాగు చేసుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కర్ణాటక ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురువడంతో తుంగభద్ర నదిలో నీరు ప్రవహించడంతో ఆగస్టు నెలలో వరి సాగు చేసుకున్నారు. అయితే గత నెలలో ఈదురు గాలులు అకాల వర్షాలు కారణంగా కడదొడ్డి, తుంబిగనూరు ప్రాంతాలలో వరి పైరు నేలకొరిగి పంటలు దెబ్బతిన్నాయి. కొంత మేరకు దిగుబడి తగ్గినా ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు వరకు వరి కాపు వచ్చినట్లు రైతులు తెలిపారు. వరి కోతలు కోయడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి



ర్యాలీ చేపడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మంత్రాలయం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లలపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని ఫీల్డు అసిస్టెంట్ల జిల్లా గౌరవ అధ్యక్షుడు అంజిబాబు, జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. ఆదివారం మంత్రాలయంలోని రాఘుసుధా కమ్యూనిటీ హాల్‌లో ఫీల్డు అసిస్టెంట్ల జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 17 ఏళ్ల పాటు పనిచేసిన నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని కోరారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్, కోశాధికారి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తం కాకపోతే ముప్పే తప్పదు

- మొగ్గ, పూత, కాయ దశలో కంది పైరు
- పైరుకు వివిధ రకాల పురుగులు ఆశించే అవకాశం
- సరైన సస్యరక్షణతో మేలైన దిగుబడులు
- ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచనలు



కందిలో మారుకా మచ్చల పురుగు



కందిలో కాయ ఈగ వల్ల దెబ్బతిన్న గింజలు

గోనెగండ్ల : ప్రస్తుతం సాగు చేసిన కంది మొగ్గ, పూత, కాయ దశలో ఉందని, సకాలంలో సరైన సస్యరక్షణ తీసుకుంటే అధిక నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 2,732 ఎకరాల్లో కంది పంట చేశారన్నారు. అయితే పైరును పలురకాలు పురుగురు ఆశించినట్లు గుర్తించామన్నారు. వాటి నివారణకు వెంటనే చర్యలు తీసుకోకపోతే తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

మారుకా మచ్చల పురుగు

మారుకా మచ్చల పురుగు (రెక్కల పురుగు) గుడ్ల నుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూత, కాయలను చుట్టలుగా చేసుకొని లోపల నుంచి వాటిని తిని నష్టం చేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ 1మిల్లీ లీటర్ లేదా అంప్లిగో మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి

కాయ ఈగ

ఈ పురుగు కనబడకుండా పైరుకు చాలా నష్టం కలుగజేస్తుంది. ఈ పురుగు కాయ చర్మం తొలిచి అక్కడ గుడ్లను పెడుతుంది. వాటి నుంచి పొదిగిన పిల్ల పురుగులు లోపల నుంచి కాయలను తినివేసి తీవ్రమైన నష్టం కలుగజేస్తాయి. ఈ పురుగు నివారణకు ముందస్తుగా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

శనగ పచ్చ పురుగు

ఈ పురుగు లార్వాలు కాయలపై రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి కాయలోని గింజలను తిని నష్టం కలుగజేస్తుంది. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఏట్ 0.3మిల్లీ గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో, 2శాతం బెల్లం ద్రావణం కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ప్రస్తుతం కంది పైరు బాగా ఏపుగా పెరిగినందువల్ల మామూలు పద్ధతుల్లో పిచికారీ కొద్దిగా కష్టంగా ఉంటుందని, డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే మందు ద్రావణంతో మొక్కపై భాగం బాగా తడపవచ్చని, దీంతో ఫలితం కూడా బాగా ఉంటుందని ఏడీఏ తెలిపారు.

అధ్వానంగా రహదారులు



సుళేకేరి బుడుములదొడ్డి సర్కిల్‌లో రోడ్డు దుస్థితి



హాల్వి రోడ్డులో ఇలా..

కౌతాళం: ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షం పడితే పాదచారులు సైతం నడవలేని స్థితిలో ఉన్నాయి. మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో చినుక పడితే ప్రతి రోడ్డు చిత్తడి మారి వర్షం, బురద నీటితో దర్శనం ఇస్తున్నాయి. ప్రధానంగా బుడుములదొడ్డి సర్కిల్ వద్ద వద్ద పరిస్థితి చాల దారుణంగా ఉంది. అడుగు లోతులో గుంతలు పడడంతో వాహనదారులు ద్విచక్ర వాహనాలు తిగరడానికి చాల కష్టంగా మారింది. సుళేకేరి నుంచి హాల్వి వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వీటికి మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం గుంతల్లో గ్రావెల్ అయినా వేస్తే కొంత వరకు వాహనదారులకు, పాదచారులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకుని గుంతల్లో గ్రావెల్ నింపాలని కోరుతున్నారు.